RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | ఆదివారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 141 | ఏప్రిల్ 27, 2025 | వెల : రూ.3-00



తప్పుల తడకగా ఇందిరమ్మ ఇండ్ల సర్వే..!?

4లో..



## అందరి ఆకాంక్షలు నెరవేర్చడమే లక్ష్యం

- తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి
- పాలిటిక్స్‌లోకి కొత్త తరం రావాలి
- లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి :**

సంక్షేమం, పెట్టుబడులు, ఉద్యోగావకాశాల కల్పన, పర్యావరణ సమతుల్యతను సాధిస్తూ ప్రజల జీవితాలను మెరుగుపరిచేందుకు ప్రజా ప్రభుత్వం చేపట్టిన మిషన్‌లో భాగస్వాములు కావాలని సీఎం రేవంత్ రెడ్డి భారత్ సమ్మిట్ వేదికగా ప్రపంచ దేశాలకు విజ్ఞప్తి చేశారు. పారదర్శకమైన సంస్కరణలతో తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపించడానికి ఇంకా ఎంతో చేయాల్సి ఉందని చెప్పారు. అందుకోసం తెలంగాణ రైజింగ్ బ్రాండ్ అంబాసిడర్లుగా రాష్ట్ర గొప్పతనాన్ని, ప్రజల ఆకాంక్షలను ప్రపంచానికి చాటాలని కోరారు.

హైదరాబాద్‌లో జరుగుతున్న భారత్ సమ్మిట్ కార్యక్రమంలో లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు ప్రపంచ దేశాల నుంచి ప్రతినిధులు హాజరైన భారత్ సమ్మిట్‌లో సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రం సాధిస్తున్న ప్రగతిని, సంక్షేమ పథకాలను,సమగ్ర అభివృద్ధి లక్ష్యాలను వివరించారు. "విద్యార్థులు, కార్మిక సంఘాలు, రైతులు, మహిళల నాయకత్వంలో దశాబ్దాల పాటు జరిగిన పోరాటాల ఫలితంగా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిందని అన్నారు. గత పదేళ్లలో ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తమ ప్రభుత్వంపై ప్రజలు అనేక ఆశలు పెట్టుకున్నారని పేర్కొన్నారు. సమాజంలోని అన్ని వర్గాల ఆకాంక్షలు నెరవేర్చడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకు అనేక పథకాలు తీసుకొచ్చామన్నారు. దేశంలోనే అతిపెద్ద రుణమాఫీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. రైతులకు సుమారు రూ.20 వేల కోట్ల రుణమాఫీ చేశామని వివరించారు. రైతులకు 24 గంటలూ ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. రైతుభరోసా కింద రైతులకు ఎకరాకు రూ.12 వేలు ఇస్తున్నామని, వరికి మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తున్నామని వెల్లడించారు.

ఓబీసీ జనగణన చేసి దేశంలోనే తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని ఎస్సీ ఉప కులాల వర్గీకరణ పూర్తి చేయడంలో కూడా దేశంలోనే మొదటి రాష్ట్రం తెలంగాణయే అని తెలిపారు. ప్రజల సమస్యలను నేరుగా విని పరిష్కరించడానికి పారదర్శకమైన పద్ధతిలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం సరికొత్త సంక్షేమ విధానాన్ని రూపొందిస్తున్నామని వివరించారు.దావోస్, అమెరికా, దక్షిణ కొరియా, జపాన్, సింగపూర్‌లలో పెట్టుబడి సమ్మిట్ల ద్వారా రాష్ట్రానికి రూ. 2.5 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించామని వీటి ద్వారా ప్రైవేట్

మిగతా 4వ పేజీలో..





### జర్నలిస్టుల భద్రత చట్టం అమలుకు

## కేంద్రంపై ఒత్తిడి తేవాలి

### జాతీయ సమావేశంలో టీఎస్ జేయూ నేతలు

**వేద న్యూస్, వరంగల్ జిల్లా :**

దేశ వ్యాప్తంగా జర్నలిస్టులకు భద్ర చట్టం అమలు చేసేందుకు కేంద్రంపై ఒత్తిడి తేవాలని నేషనల్ జర్నలిస్ట్ యూనియన్ (ఇండియా) (ఎన్‌యుజెఐ)కార్యవర్గ సమావేశంలో తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (టిఎస్‌జెయు) ప్రతినిధులు సూచించారు.రాజస్థాన్ రాష్ట్రంలోని బికనేర్ పట్టణంలో ఈనెల 26,27 తేదీలలో ఎన్ యు జె (ఐ)జాతీయ కార్యవర్గ సమావేశాలు జరిగాయి.ఈ సమావేశానికి జాతీయ అధ్యక్షుడు సురేష్ శర్మ అధ్యక్షత వహించారు.ప్రధాన కార్యదర్శి త్రియగ్ నారాయణ,జాతీయ కార్యదర్శి మెరుగు చంద్రమోహన్ పాల్గొనగా టిఎస్ జేయు తెలంగాణ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పావుశెట్టి శ్రీనివాస్,జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు ఎడ్ల సంతోష్ లు మాట్లాడుతూ తెలంగాణలో జర్నలిస్టులో గత దశాబ్ద కాలంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం టిఎస్ జెయు ఆధ్వర్యంలో పలు పోరాటాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.విధి నిర్వహణలో భాగంగా అనేకమంది జర్నలిస్టులు దాడులకు గురవుతున్నారని వివరించారు. దీంతో జర్నలిస్టులకు భద్రత కరువవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.దీనిని దృష్టిలో ఉంచుకొని జర్నలిస్టుల భద్రతా చట్టాన్ని పక్కాగా రూపొందించి అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు జర్నలిస్టుల సంక్షేమాల కోసం ప్రత్యేక పథకాలను రూపొందించాలని కోరారు.తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్ర అధ్యక్షులు నారగాని పురుషోత్తం ,ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్‌ల ఆధ్వర్యంలో టిఎస్ జేయూ సభ్యులకు రూ.5 లక్షల ఇన్సూరెన్స్‌ను యూనియన్ నిధుల ద్వారా అందజేస్తున్నట్లు

మిగతా 4వ పేజీలో..



### ఛాంబర్‌లలో వసతులను

## పునరుద్ధరించండి

**వేద న్యూస్, వరంగల్ :**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాల యంలోని వివిధ విభాగాల ఛాంబర్‌లలో దెబ్బతిన వివిధ వసతు లను పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే అభిప్రా యపడ్డారు. బల్దియా ప్రధాన కార్యాలయంలోని పాత భవనంలో గల వివిధ విభాగాల ఛాంబర్‌లను కమిషనర్ శనివారం క్షేత్ర స్తాయిలో పరిశీలించి చేయాల్సిన ఏర్పాట్లపై ఇంజనీరింగ్ అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కార్యాలయాల్లో దెబ్బతిన్న ఫ్లోరింగ్, మరుగుదొడ్లు, నీటి సరఫరాను పునరుద్ధరించడం దెబ్బతిన్న కుర్చీలు, టేబుల్స్ స్థానంలో కొత్తవాటిని

మిగతా 4వ పేజీలో..

## బీఆర్ఎస్ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు..!

- కేసీఆర్,బీఆర్ఎస్ నేతలపై గంట రవికుమార్ విమర్శలు
- పిట్టలదొర వస్తున్నాడు జాగ్రత్త..!
- వరంగల్ కు బీఆర్ఎస్ చేసింది శూన్యం
- ఉద్యమం పేరుతో పదేళ్లు అధికారం అనుభవించారు
- 50ఏళ్లు నగరాన్ని వెనక్కి నెట్టిన నీచపు చరిత్ర బిఆర్ఎస్ పార్టీది
- ధరణి పేరుతో రైతులను ఆగం చేశారు
- వరంగల్ బిజెపి జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్



**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి :**

ఉద్యమం పేరు చెప్పి పదేళ్లు అధికారం అనుభవించారు తప్ప బిఆర్ఎస్ చేసిన పని శూన్యమని మండిపడ్డారు బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్. శనివారం వరంగల్ జిల్లా భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ అధికారాన్ని అడ్డుపెట్టుకొని భూకబ్జాలు చేశారు తప్ప అభివృద్ధి చేయలేదని ఆరోపించారు. వరంగల్ కు ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని మండిపడ్డారు. అందుకే వరంగల్ నగరంలో సభ పెడితే ఫెయిల్ అవుతుందని కరీంనగర్, సిద్దిపేట బార్డర్లో పెట్టుకుంటున్నారని అన్నారు. గప్పలు కొట్టే పిట్టలదొర మళ్లీ వస్తున్నాడు ఓరుగల్లు ప్రజలు తస్మాత్ జాగ్రత్తగా ఉండాలని అన్నారు.

ఎల్కతుర్తిలో సభ పెట్టి చలో వరంగల్ అని పిలుపునియ్యడం సిగ్గుచేటన్నారు.వరంగల్ కు మాస్టర్ ప్లాన్ అమలుచేయకుండా పదేండ్లు అభివృద్ధిని అడ్డుకొని 50 ఏళ్లు నగరాన్ని వెనక్కి నెట్టిన నీచపు చరిత్ర బిఆర్ఎస్ పార్టీదని ధ్వజమెత్తారు. ప్రతి ఏడాది వరంగల్ కు రూ.300 కోట్లు ఇస్తామని ప్రజలను మోసం చేసిన పార్టీ బిఆర్ఎస్ పార్టీ అని అన్నారు.

2014 లో మడికొండలో జరిగిన సభలో ఏడాదిలోపు డబుల్ బెడ్ రూమ్ లు కట్టించి యాటపోతు కోసి, కల్లు గుడాలతో గృహప్రవేశాలు చేస్తామన్నమాట మరిచిపోయారా అంటూ గుర్తు చేశారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, అంతర్గత రోడ్లు అంటూ ఆకాశాన్ని తాకే హామీలు ఇచ్చిన బిఆర్ఎస్ పార్టీ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని తెలిపారు.

2023 ఎన్నికల ముందు రూ.750 కోట్లతో అభివృద్ధి పనుల శంకుస్థాపనకు కొబ్బరికాయ కొట్టిన కేటీఆర్ ఎక్కడ నీ అభివృద్ధి అని ప్రశ్నించారు. కాకతీయుల ఘన చరిత్ర కలిగిన ఓరుగల్లు మహానగరాన్ని చిన్నచూపు చూసి సిద్దిపేటను అభివృద్ధి చేసుకోవడం కోసం వరంగల్ నిధులను మళ్లించిన దరిద్రపు పార్టీ బిఆర్ఎస్ అని విమర్శించారు. ఉమ్మడి వరంగల్ ను 6 ముక్కలు చేసి, నగరాన్ని రెండు ముక్కలు చేసిన నీచపు చరిత్ర బిఆర్ఎస్ పార్టీదని మండి

మిగతా 4వ పేజీలో..



### నిరంతర శ్రామికుడు

## దిలీప్ సింగ్

**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి :**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవా ణా సంస్థ 1988లో ఉప్పల్ డిపోలో సెక్యూరిటీ గార్డుగా కేవలం 387 రూపాయలతో విధి నిర్వహణలో చేరిన దిలీప్ సింగ్ ఇతర ఉద్యోగులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఉప్పల్ డిపోలో ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించి అనంతరం రాజేంద్రనగర్, మిధాని, సిద్దిపేట, దిల్ సుఖ్ నగర్ ప్రాంతాలలో తన సేవలు అందిస్తూ ఉద్యోగ విరమణ చేశారు. ఉద్యోగ విరమణ చేసిన తర్వాత కూడా మిధాని డిపో పరిధిలో ప్రతిరోజు మీర్ పేట చౌరస్తాలో ఎలాంటి పారితోషకం ఆశించకుండా విధులు నిర్వహించడం అభినందనీయం. ముఖ్యంగా రోడ్డు రవాణా సంస్థలో రిటైర్ అయిన

మిగతా 4వ పేజీలో..

## మెగా జాబ్ మేళాకి ఏర్పాట్లు పూర్తి

**వేద న్యూస్, శాయంపేట:**

ఆదివారం ఉదయం ఏడు గంటల నుండి రాత్రి వరకు భూపాలపల్లిలోని పుష్ప గ్రాండ్ కన్వెన్షన్ హాల్లో జరిగే మెగా జాబ్ మేళా కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎమ్మెల్యే జిఎస్ఆర్ తెలిపారు.జాబ్ మేళా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యతో పాటు పలువురు ఎమ్మెల్యేలు రానున్నట్లు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. శనివారం పుష్ప గ్రాండ్ కన్వెన్షన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టాస్క్ ప్రతినిధి ప్రదీప్ రెడ్డి కాంగ్రెస్ ముఖ్య నేతలతో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుండి రేపటి మెగా జాబ్ మేళా కార్యక్రమానికి వచ్చే అభ్యర్థులకు అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే ఈ మహోన్నత కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. నిరుద్యోగులు గ్రామాల నుండి జిల్లా కేంద్రానికి చేరుకునేలా పంచాయతీ సెక్రటరీలు, అంగన్వాడీ టీచర్లు, ఎంపీడీవోలు, ఎమ్మార్వోలు అన్ని ఏర్పాట్లు చేసుకున్నట్లు తెలిపారు. ఆన్ లైన్ లో రిజిస్ట్రేషన్ చేసుకోలేని వారి కోసం ప్రత్యేకంగా రిజిస్ట్రేషన్ కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా, ఈ జాబ్ మేళా కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని, ప్రతీ ఆరు నెలలకొకసారి జాబ్ మేళాను భూపాలపల్లిలో ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. జాబ్ మేళా కార్యక్రమానికి వచ్చే అభ్యర్థులు మొత్తం ఐదు సెట్లతో



కూడిన విద్యార్హత సర్టిఫికెట్లతో రావాలని, ఎంపికైన అభ్యర్థులకు వివిధ కంపెనీలో నెలకు రూ.15 వేల నుండి రూ.50 వేల వరకు వేతనం పొందవచ్చని టాస్క్ ప్రతినిధి ప్రదీప్ రెడ్డి తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే వెంట పలువురు పట్టణ కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షులుగా బీసీని ప్రకటించాలి



- బీసీ రిజర్వేషన్లకు కట్టుబడి ఉంటే

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

తెలంగాణ రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ బీసీ రిజర్వేషన్లకు అనుకూలమైతే తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా బీసీలను నియమించాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షులు పోగుల సైదులు గౌడ్ డిమాండ్ చేశారు.దేశ రాష్ట్రవ్యాప్తంగా బీసీ హక్కులకి ఉద్యమిస్తున్న సమయంలో ఇప్పుడు బిఆర్ఎస్ పార్టీ కపట ప్రేమను నటిస్తూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేసే విషయం నిజమైతే,పార్టీ ఆవిర్భావం నుంచి అగ్రకులమైన వెలను కులస్తుల ఆదిపత్యంలో ఉన్నటువంటి బిఆర్ఎస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా బీసీలను ఎన్నుకొని చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని అన్నారు.రాజకీయ అవసరాల కోసం బీసీల మీద దొంగ ప్రేమను వలకబోసే బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం నుంచి గాని, 10 సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పుడు గాని బీసీలను ఎందుకు మరిచారని ప్రశ్నించారు. అధికారం కోల్పోయాక బీసీ ఉద్యమం ఎగసిపడుతున్న సమయంలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా నిజంగా చిత్తశుద్ధి ఉంటే 27న జరగబోయే బిఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ సభలో రాష్ట్ర అధ్యక్షునిగా బీసీని నియమిస్తూ వారి నిజాయితీ నిరూపించుకోవాలన్నారు. కాలానికి అనుకూలంగా ఏ ఎండకు ఆ గొడుగు పట్టే విధంగా టిఆర్ఎస్ పార్టీ ప్రవర్తించవదన్నారు. ఇప్పటికైనా మార్పు వస్తే బీసీలకు న్యాయం చేయాలని అనుకుంటే మొదట రాష్ట్ర అధ్యక్షులుగా బీసీ నియామకముతో ముందుకు వస్తే బీసీ సమాజం నమ్ముతుందన్నారు.


ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి కర్నాటి శివరామకృష్ణ,మాల మహానాడు అధ్యక్షులు తాళ్లపల్లిరవి,తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మునిగంటివెంకన్న,బీసీ జివిసి రాష్ట్ర నాయకులు దాసరాజు జయరాజు,బీసీ విద్యార్థి సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు మహేష్,బీసీ నాయకులు గోడిగెసంతోష్ యాదవ్,వెంకటేశ్వర్లు,శ్రీనివాస్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

# కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ప్రజలకు ఇబ్బందులు

- బురదమయంగా ప్రధాన రహదారి
- 2 నెలలుగా నత్తనడకన పనులు
- వేసవికాలంలో నీటికి జనం తండ్లాట
- పట్టించుకోని కార్పొరేషన్ అధికారులు
- అల్మాస్‌గూడ సీఎంఆర్ కాలనీవాసులకు తిప్పలు
- బీజేపీ యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శూరకర్ణరెడ్డి

**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి:**

మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ అల్మాస్‌గూడ మూడో డివిజన్‌లోని సీఎంఆర్ కాలనీ ప్రధాన రహదారి బురదమయంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామిడి శూరకర్ణరెడ్డి శనివారం ఆరోపించారు. కాంట్రాక్టర్ శేఖర్‌రెడ్డి సీఎంఆర్ కాలనీలో ట్రంక్ ఇరువైపులా డ్రైనేజీ పనులను ప్రారంభించి రెండు నెలలు గడుస్తున్నా పనులు పూర్తి చేయలేదన్నారు. సగం సగం పనులు చేసి కాలనీవాసులను ఇబ్బందికి గురి చేస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేసిన పనికి బిల్లులు రాలేదనే సాకుతో అధికారులపై నెపం నెట్టుతూ 500 మీటర్ల డ్రైనేజీ పనులను 2 నెలలుగా పూర్తి చేయలేదని పేర్కొన్నారు. ఈ విషయమై కాంట్రాక్టర్‌ను ప్రశ్నిస్తే 'దిక్కున్న చోట చెప్పుకోండి' అంటూ సమాధానం ఇస్తున్నారని వివరించారు. అధికారుల దృష్టికి ఈ సంగతి తీసుకెళ్లి.. ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఆఫీసర్లు.. అటువైపు కన్నెత్తి చూడటం లేదని ఆరోపించారు. వాహనదారులు, కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు. కాంట్రాక్టర్, అధికారులు కుమ్మక్కయి నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా పనులు చేశారని, కనీసం మ్యాన్ హోల్స్ రిపేరు చేయించలేని దుస్థితి ఏర్పడిందని వెల్లడించారు. 2 నెలలుగా పనులు నత్తనడకన సాగడంతో సరిగా పనులు చేయకపోవడంతో వాటర్ లైన్ పూర్తిగా పాడైందని చెప్పారు. వాటర్ కనెక్షన్లు కట్ అవ్వడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని..వేసవికాలంలో నీళ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని స్పష్టం చేశారు. మున్సిపల్



కమిషనర్, అధికారులు ఇప్పటివరకు ఆ డ్రైనేజీ పనులు పూర్తి చేయించలేదని, తక్షణమే ఈ సమస్యకు పరిష్కారం చూపించాలని కాంట్రాక్టర్‌పై తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

# కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ట్రిబ్యునల్ జడ్జి



**వేద న్యూస్, వరంగల్ :**

వరంగల్ ట్రిబ్యునల్ జడ్జి గా నియమితులైన నారాయణ బాబు శనివారం వరంగల్ జిల్లా కలెక్టర్ డా.సత్య శారద ను కలెక్టరేట్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు. భూపాలపల్లిలో విధులు నిర్వహించిన నారాయణ బాబు బదిలీపై వరంగల్ ట్రిబ్యునల్ జడ్జి గా నియమితులయ్యారు.

# పోలీస్ స్టేషన్‌ను ముట్టడించిన గ్రామస్తులు

**వేద న్యూస్, డెస్క్:**

పోలీస్ కస్టడీలో ఉన్న మద్యం స్మగ్లర్‌ను విడిపించేందుకు గ్రామస్తులు ప్రయత్నించారు. మూకుమ్మడిగా పోలీస్ స్టేషన్‌ను ముట్టడించారు. పోలీసులతో ఘర్షణపడ్డారు. ఈ దాడిలో నలుగురు పోలీసులతో సహా 12 మంది గాయపడ్డారు. బీహార్‌లోని కతిహార్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. రాయ్‌పూర్ గ్రామానికి చెందిన మద్యం స్మగ్లర్ సూరజ్ కుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ధన్‌ఖోరా పోలీస్ స్టేషన్‌కు అతడ్ని తరలించారు. కాగా, పోలీస్ కస్టడీలో ఉన్న మద్యం స్మగ్లర్ సూరజ్ కుమార్‌ను విడిపించేందుకు గ్రామస్తులు ప్రయత్నించారు. శనివారం సుమారు వంద మంది పోలీస్ స్టేషన్‌ను ముట్టడించారు. అతడ్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు, గ్రామస్తుల మధ్య ఘర్షణ జరిగింది. దీంతో పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపారు. ఈ ఘర్షణలో నలుగురు పోలీసులతో సహా 12 మంది గాయపడ్డారు.

# పహాల్గమ్ దాడిలో మృతులకు ఘననివాళులు

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**



కాశ్మీర్ లో జరిగిన పహల్గామ్ ఉగ్రవాద దాడికి నిరసనగా మిర్యాలగూడ పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఉగ్రదాడిలో మృతి చెందిన పర్యాటకులకు నివాళులు అర్పిస్తూ మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం మిర్యాలగూడ పట్టణం లోని ఎంపీడీవో కార్యాలయం నుంచి అమరవీరుల స్థూపం వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించడం జరుగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాడికి పాల్పడిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని,దాడిలో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ మృతులకు నివాళులు అర్పిస్తున్నామని అన్నారు.ర్యాలీ ఉందని పిలుపునివ్వగానే వందల సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ డి ఎస్పీ రాజశేఖర్ రాజు,తహసిల్దార్ హరిబాబు లతో పాటు,పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు,మీన కళాశాల విద్యార్థులు,మిర్యాలగూడ నియోజకవర్గ ప్రజలు,ప్రభుత్వ అధికారులు,ఉద్యమ సంఘాలు,కుల సంఘాలు,స్వచ్ఛంధ సంస్థలు,ఉద్యోగ సంఘాలు,ప్రైవేట్ సంస్థలు,వ్యాపారస్థులు,వివిధ పార్టీల నాయకులు,విద్యార్థి సంఘాల నాయకులు,కుల,మత,పార్టీలకు అతీతంగా పాల్గొని అమరులకు నివాళులు అర్పించడం జరిగింది.

# 13వ రోజుకు చేరిన జర్నలిస్టుల రిలే నిరాహార దీక్షలు

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**




జర్నలిస్టుల కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను తమకు తక్షణమే కేటాయించాలని దేశాయిపేట లక్ష్మీ మెగా టౌన్షిప్ లోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ముందు వరంగల్ తూర్పు వర్కింగ్ జర్నలిస్టులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. శనివారం 13వ రోజుకు చేరుకున్న నిరాహార దీక్షకు పలువురు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ గత 13 రోజులుగా న్యాయపోరాటం చేస్తున్న కూడా స్థానిక ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించకపోవడం ఆవేదన కలిగిస్తుందని అన్నారు. జర్నలిస్టులే న్యాయం కోసం దీక్షలు చేయబడుతుంటే పట్టించుకోని పాలకులు సామాన్య ప్రజల పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవాలని అన్నారు.

# అడిషనల్ పిపికి సన్మానం



**వేదా న్యూస్, కోరుట్ల ప్రతినిధి :**

ఇటీవల మెట్ పల్లి అసిస్టెంట్ సెషన్ కోర్టు కి అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా నియామకమైన చెర్లపల్లి ఆనంద్ గౌడ్ ను వెల్లుల్లా గౌడ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు గౌడ సంఘం నాయకులు మాట్లాడుతూ భవిష్యత్ లో ఆనంద్ గౌడ్ మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమం లో వెల్లుల్ల గౌడ సంఘం సభ్యులు కోలు పెద్ద గంగారాం, బత్తిని శంకర్ గౌడ్, అయిలేని శైలేందర్ గౌడ్, మంతెన గణేష్, బావు శంకర్ గౌడ్, ఉత్కం శ్రీనివాస్ గౌడ్ తదితరులు ఉన్నారు.

# అనుమతులు లేని అవని జూనియర్ కళాశాలను సీజ్ చేయాలి

- ఏఐఎఫ్ డిస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున

**వేద న్యూస్, వరంగల్ :**



రాష్ట్ర విద్యా శాఖ నుండి ఎలాంటి అనుమతులు లేకుండా హన్మకొండ పట్టణం భీమారం, ఔటర్ రింగ్ రోడ్డు ప్రాంతాలలో నిర్వహిస్తున్న అవని జూనియర్ కళాశాలలను సీజ్ చేసి ఆ యజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని అఖిలభారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య(ఏ ఐ ఎఫ్ డి ఎస్) తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.శనివారం హనుమకొండ పట్టణ%శీ% నుండి అఖిలభారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య(ఏ ఎఫ్ డి ఎస్)తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున ప్రకటన విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా గడ్డం నాగార్జున మాట్లాడుతూ.. భీమారం ఔటర్ రింగ్ రోడ్డు ప్రాంతంలోని అవని జూనియర్ కళాశాల ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించకుండా ఎలాంటి పర్మిషన్ లేకుండా, పెద్ద పెద్ద హోర్డింగులు ఫ్లెక్సీలు బ్రోచర్లు వేస్తూ విద్యార్థులను, విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తూ అడ్మిషన్ తీసుకోవడం జరుగుతుందన్నారు. పేరుకు అకాడమీ లని చెప్పుకుంటూ విద్యాశాఖ కండ్లు గప్పి జూనియర్ కళాశాలలు నిర్వహించడం సిగ్గుచేటు, కళాశాల పర్మిషన్ లేకుండా ప్రభుత్వాన్ని మోసం చేస్తూ కళాశాలలు నిర్వహిస్తూ, అడ్మిషన్ల పేరుతో అధిక ఫీజులు లక్షలలో వసూలు చేస్తున్న అవని యాజమాన్యంపై చట్టరీత్యా చర్యలు తీసుకొని క్రిమినల్ కేసులు నమోదు చేసి ఆ కళాశాలలను సీజ్ చేయాల ని గడ్డం నాగార్జున రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఛలో వరంగల్..

- బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి
- మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు

వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :



త్యాగాల పునాదులపై నిర్మితమైన భారత రాష్ట్ర సమితి పార్టీ ఆవిర్భవించింది 25వ వసంతంలోకి అడుగుబెడుతున్న శుభ సందర్భంగా పార్టీ చీఫ్ కేసీఆర్ భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. నేడు (ఆదివారం)వరంగల్ జిల్లాలోని ఎల్కతుర్తి వద్ద నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల నుంచి బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నేతలు పెద్ద ఎత్తు న హాజరుకానున్నారు. దీనిలో భాగంగా మిర్యాలగూడ నియోజకవర్గం నుంచి 4170 మంది బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలివెళ్లనున్నట్టు మిర్యాలగూడ మాజీ శాసనసభ్యులు భాస్కర్ రావు వెల్లడించారు. ఈ మేరకు ఏర్పాట్లను పూర్తి చేసినట్టు ఆయన పేర్కొన్నారు.రజతోత్సవ సభకు 256 కార్లలో 1250 మంది, 47 స్కూల్ బస్సులలో 1880 మంది, 20 టీజీఆర్టీసీ బస్సులలో 1040 మంది మొత్తం కలుపుకొని 4170 మంది, సొంత వాహనాల్లో వందలాది మంది బీఆర్ఎస్ కార్యకర్తలు మిర్యాలగూడ నియోజకవర్గం నుంచి ఎల్కతుర్తి వద్ద నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలివెళ్ళనున్నట్టు భాస్కర్ రావు తెలిపారు. సభకు వచ్చే వారందరికీ ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు.నిర్ణీత సమయంలోపు కార్యకర్తలు సభకు తరలివెళ్లేందుకు సన్నద్ధం కావాలని సూచించారు.

# ప్రపంచ పశువైద్యుల దినోత్సవ శుభాకాంక్షలు

**- కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వేద న్యూస్, వరంగల్ :**

వరంగల్ జిల్లా కలెక్టరేట్ లో శనివారం ప్రపంచ పశు వైద్యుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద,అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, జిల్లా పరిషత్ సీఈఓ రామ్ రెడ్డి తో పాటు సంయుక్త సంచాలకులు పశు వైద్యాధికారి డాక్టర్ బాలకృష్ణ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ మీ సేవలు అమూల్యమైనవి పశు సంపద దేశానికి వెన్నెముక లాంటిదని పశుసంక్షేమ అభివృద్ధిలో పశువైద్యుల పాత్ర అనన్యసామాన్యమన్నారు.మీ సేవలు అపూర్వం మన్నారు. పశు సంక్షేమం కోసం మీరు చేస్తున్న కృషికి చాలా గొప్పదని,మూగ జీవులకు సేవా చేయడం లో మీకున్న సమయస్ఫూర్తి గొప్పదని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ పశువులకు ఉపయోగపడే శాస్త్రాన్ని చదివి మూగ జీవులకు సేవ చేసే అవకాశం మీకు లభించడం దానిని మీరు వృత్తి పరంగా కాకుండా సహృదయంతో వృత్తి ధర్మాన్ని పాటించాలని అన్నారు. అనంతరం కలెక్టర్ కి శాలువాతో సత్కరించి మెమెంటో జ్ఞాపిక ను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో మామునూర్ వెటర్నరీ కాలెజి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వంశీ కృష్ణ, డాక్టర్ బాలోజీ, డాక్టర్. బి.ఎన్.రెడ్డి డాక్టర్ వెంకటేశ్వర్లు,జిల్లాలోని వెటర్నరీ డాక్టర్స్ తదితరులు పాల్గొన్నారు.




# భక్తుల కోర్కెలు తీర్చే కొంగు బంగారం..

# శ్రీభూనీలసమేత వరదరాజస్వామి


**వేద న్యూస్,రంగారెడ్డి ప్రతినిధి :**

కోరుకున్న వారికి కొంగు బంగారంగా, కోర్కెలు తీర్చే భగవంతుడిగా భక్తుల సేవలు అందుకుంటున్నారు శ్రీ భూ నీలా సమేత వరదరాజస్వామి. శ్రీ మహావిష్ణువు అవతారాలలో శ్రీ వరదరాజ స్వామి స్వరూపం ఒకటి. వరదరాజ స్వామి నామస్మరణం భవసాగరాన్ని దాటించేదిగా భక్త జనాలు భావించి, స్మరించి, కొలుస్తూ ఉంటారు. మహిమాన్వితుడైన ఆ స్వామి కొలువైన మరో పుణ్య దామం వరదరాజపురం. ఉమ్మడి మెదక్ జిల్లా జగదేవ్ పూర్ మండలంలో ఉన్న ఈ దివ్య క్షేత్రంలో శ్రీ భూనీల సమేతుడైన వరదరాజస్వామి ఆలయ విశేషాలు మా వేద న్యూస్ పాఠకుల కొరకు...

శ్రీ భూ నీలా సమేత వరదరాజ స్వామి ఇక్కడ కొలువై ఉండడానికి ఒక పురాణ గాథ ప్రచారంలో ఉంది. శ్రీ గూడా ఆచార్య పండితులు శనిగరం అనే గ్రామంలో వరదరాజస్వామిని ప్రతిష్టించాలని అదే సంకల్పంతో కంచిలోని అర్చకులను స్వామివారు ఇరుదేవతలతో ఉన్న అర్చామూర్తులను ఇవ్వమని అడగగా వారు ఇవ్వడం జరిగిందట. అష్టమూర్తులకు పూజా కైంకర్యాలు నిర్వహిస్తూ ఉమ్మడి మెదక్ జిల్లా ప్రస్తుతం సిద్దిపేట జిల్లా గజ్వేల్ తాలూకాలో గల అరణ్య ప్రాంతానికి వచ్చి అక్కడే విశ్రమించి తెల్లవారుజామున కైంకర్యాలు పూర్తి చేసుకుని బయలుదేరే ప్రయత్నం చేయగా ఎంతకు శ్రీ వరదరాజ స్వామి వారి బండి కదల లేదట. ఈ సంఘటనకు ఆచార్య పండితులు విచారిస్తుండగా సాక్షాత్తు వరాజరాజస్వామి బ్రాహ్మణుడిని ఆవహించి తను అక్కడే ఉంటానని చెప్పాడట. దానితో వారు స్వామిని ప్రతిష్టించి పూజాధికాలు నిర్వహించి అనంతరం ఆచార్య పండితుల కృషి ఫలితంగా వెలసిన దేవాలయం వరద రాజస్వామి ఆలయంగా ఈ క్షేత్రం వరదరాజపురం గా ప్రసిద్ధి చెందింది.

విష్ణు నారాయణం, కృష్ణం, మాధవం, మధుసూదనం, హరి, నరహరి,రామ, గోవిందం, దధికాహనం అని విష్ణు భగవానుని 10 పేర్లు జపిస్తే సర్వ సుఖాలు కలుగుతాయని బ్రహ్మ పురాణం లో విష్ణు నామ మహిమ విశేషాలను వివరించడం జరిగింది. దుష్ట శిక్షణ శిష్ట రక్షణ చేయడం కోసం పది యుగాలలో 10 అవతారలేత్తి తన యుగ ధర్మాన్ని నిర్వర్తించారు. ఆ స్వామి అర్చావ వతార మూర్తికి ఆలయాలు అత్యంత అరుదైనవి. ఆ నేపథ్యంలోనే ఆవిష్కారం అయినా అరుదైన దివ్య క్షేత్రం మెదక్ జిల్లా జగదేవపూర్ మండలం గజ్వేల్ తాలూకాలోని వరదరాజపురంలో వేంచేసిన శ్రీ భూలీల సమేతు డైన వరదరాజస్వామి దేవస్థానం. 700 సంవత్సరాల అతి పురాతనమైన వరదరాజస్వామి దేవాలయం అత్యంత మహిమాన్విత మైనదిగా పేరుగాంచింది. ఆలయానికి చేరుకున్న భక్తులకు శ్వేత వర్ణ మూడంతస్తుల గాలిగోపురం దర్శనమిస్తుంది. త్రికలష గాలిగోపురాన్ని దర్శించుకున్న భక్తులు దేవాలయ ప్రాంగణానికి చేరుకుంటారు.

ఆలయ ప్రాంగణంమనోహరమైన రాతి సుమున్నత కట్టడంతో అలనాటి శిల్పుల ధార్మిక పిపాసకు గుర్తుగా బాసిస్తుంది. చుట్టూ విశాలమైన ప్రాకారాలతో అధ్యయన మండపం హోమ శాలలు కనిపిస్తాయి. ఆలయ ప్రాంగణంలో గర్భాలయానికి ఎదురుగా ఎత్తైన ధ్వజస్తంభం దర్శనమిస్తుంది పంచలోహ సమున్నత ధ్వజాగ్ర పాదపీఠంపై తిరునామం శంకు చక్రాలు



ఉంటాయి. ఈ స్తంభం దిగువన బలిపీఠం ఉంటుంది ధ్వజస్తంభం బలిపీఠం దర్శనం చేసుకున్న భక్తులు వాటి చుట్టూ భక్తిశ్రద్ధలతో ప్రదర్శన చేస్తారు. ధ్వజస్తంభం కింది భాగంలో గరుడాళ్వార్ మూర్తి కనిపిస్తుంది. గర్భాలయంలోకి చేరుకున్న భక్తులు సమేత వరదరాజ స్వామి వారి దివ్య మంగళ మూర్తిని దర్శించి భక్తితో చేతులు జోడిస్తారు. గర్భాలయంలో చేరుకున్న భక్తులు శ్రీ బూలీల సమేత వరదరాజస్వామి దివ్య మంగళ మూర్తిని దర్శించుకుని అవ్యక్తమైన ఆనందానికి అనుభూతులకు లోనవుతారు. ఏక మకర తోరణం లో వెలుగొందుతున్న ఆ స్వామి తిరునామం నుదుటన ధరించి ఒక చేత శంఖం మరో చేత చక్రం దర్శనమిస్తాయి. దేదీప్య మానంగా వెలుగొందుతున్న ఆ దివ్య మంగళ మూర్తులను దర్శించుకుని అవ్యక్తమైన ఆనంద అనుభూతులకు లోనవుతారు. శ్రీ వరదరాజ స్వామి వారి ఆలయంలో రోజు స్వామివారికి చేసే అర్చనాది అభిషేకాలు నయనానందకరం భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఆ పూజా కార్యక్రమాలు చేసి తరిస్తారు. ఉత్సవ విగ్రహాలకు ప్రతి శనివారం ప్రతి మంగళవారం పుష్పాంజలి సేవ కడు రమణీయం ప్రతి శనివారం స్వామివారికి ప్రత్యేకంగా పంచామృతాల తో అభిషేకాలు జరుగుతాయి.

భక్తులు స్వామివారి ఎడమ భాగంలో ఉన్న శ్రీ భూదేవి అమ్మవారి నల్లరాతి విగ్రహాన్ని దర్శించుకుంటారు. స్వామి వారి కుడి భాగంలో పండిత ఆళ్వారు మందిరం కూడా ఉంది. వైష్ణవ సనాతన సాంప్రదాయాలను విశేషంగా ప్రాచుర్యంలోకి తెచ్చిన ఆ ఆళ్వార్లను దైవాంశ సంభూతులుగా ఆరాధిస్తారు. గర్భాలయం మండపంలో ప్రవేశించిన భక్తులకు ప్రాకార గోడ పైన భాగంలో బంగారు బల్లి వెండి తొండ ఎదురెదురుగా కనిపిస్తాయి. బంగారు బల్లులను భక్తులు దర్శించుకుని నమస్కరించు కుంటారు. ఇక్కడ సమీపంలో ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయానికి చేరుకుంటారు అపర భక్తాగ్రేసరుడు అయిన వీర హనుమాన్ ని దర్శించుకుని అలౌకికమైన ఆనందానికి గురి అవుతారు. అనంతరం భక్తులు నేత్రోత్సాహాన్ని కలిగిస్తాయి భక్తజన కోలాహలంగా కనిపించే భక్తులందరి ఆకాంక్ష ఒక్కటే అభయానంద ప్రదాత అయిన ఆంజనేయుని దర్శించుకుని తరించాలని ఉత్సు కత భక్తులలో ప్రస్ఫుటంగా గోచరిస్తుంది. ప్రతి మంగళ శనివారాలలో ఆలయంలోని అభిషేక వేడుకలు నయనానందకరంగా నిర్వహిస్తారు. నారికేళ గోక్షిర సుగంధ జల హరిద్రొదక పంచామృతాల అభిషేకం ప్రేక్షకులకు నేత్రానందం కల్పిస్తుంది అభిషేక అనంతరం స్వామి వారికి సింధూరాన్ని అమరి మెడలో వడమాల తోమాల నానావిధ పరిమళ పుష్పాలతిఅలంకరిస్తారు. అనంతరం స్వామివారికి ఇచ్చిన కర్పూర హారతిని కళ్ళకు అద్దుకుంటారు. స్వామివారి తీర్థప్రసాదాలు గైకొన్న భక్తులు శ్రీ ప్రహల్లాద వరద లక్ష్మీనరసింహస్వామి మందిరానికి చేరుకుంటారు. శ్వేత శిలాఫలకం పై స్వామివారు హిరణ్యకశిపుని సంహరిస్తున్న దృశ్యం కనిపిస్తుంది. పక్కనే ప్రహ్లాదుడు నమస్కారముద్రలో దర్శనమిస్తారు.

ఈ ఆలయంలో ఏటా వైశాఖ శుద్ధ సప్తమి నుండి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. పంచారాత్ర ఆగమ శాస్త్రానుసారం జరిగే ఈ బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. వైశాఖ శుద్ధ పౌర్ణమి రోజు కంచి గరుడ సేవ అలాగే సమీపంలో ఉన్న హనుమాన్ మందిరం తిరువీధి ఉత్సవం కన్నుల పండుగగా జరుగుతుంది. ఈ ఉత్సవ పరంపరను వీక్షించడానికి వేలాది మంది భక్తులు సుదూర ప్రాంతాల నుండి తరలి వస్తారు ఈ ఆలయంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీ భూనీల వరదరాజస్వామి కళ్యాణ మహోత్సవాన్ని వీక్షించడానికి వేలాదిమంది వస్తారు. స్వామివారికి దేవేరులకు శశాస్త్రీయంగా మంత్రయుక్తంగా పట్టు వస్త్రాలు సమర్పించి ముహూర్త వేలకు జీలకర్ర బెల్లం శిరీషను ఉంచి మంగళ సూత్రధారణ గావించి తలంబ్రాల వేడుకను తన్వయమందుకుంటారు స్వామి వారి కళ్యాణ అనంతరం పూజారులు చేసే నాట్యం కడు రమణీయంగా సాగుతుంది. వరదరాజస్వామి వారి మూర్తులను మేళ తాళాలతో మంత్రోచ్ఛరణ గావిస్తూ ఆలయ పురోహితుల చేతుల మీదగా హనుమంత వాహనం మీద డప్పు భాజా వాయిద్యాలతో స్వామివారి తిరువీధి సేవ ప్రారంభం అవుతుంది వేలాదిమంది భక్తులు స్వామి వారి కీర్తనలు ఆలపిస్తూ తమను తాము మైమరచిపోతారు. వీధి వీధి స్వామి తిరిగి భక్తుల చేత పూజలు అందుకుంటారు ప్రతి సంవత్సరం వైశాఖ శుద్ధ సప్తమి మొదలు వైశాఖ శుద్ధ బహుళ చవితి వరకు బ్రహ్మోత్సవాలు 11 రోజులు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఈ దేవాలయ ధర్మకర్తలైన గూడ రఘువీర రావు నిర్మించిన ఈ ఆలయం ప్రొద్దుటూరు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో దిని దిన ప్రవర్ధమానం అయి దేదీప్యమానంగా వెలుగొందుతుంది ఈ దేవాలయానికి వెళ్లాలంటే హైదరాబాదు నుండి రాజీవ్ రహదారిలో ప్రజ్ఞాపూర్ వెళ్లి అక్కడిఅక్కడి నుండి భువనగిరి రహదారిలో జగదేవ్ పూర్ వరకు వెళ్లవచ్చు జగదేవ్ పూర్ నుండి విపరీతమైన ఆటోలు అందుబాటులో ఉంటాయి అని వరదరాజపురంలో జన్మించిన హైదరాబాదు సంతోష్ నగర్ దేవాలయ ప్రధాన అర్చకులు డాక్టర్ నల్లదిగా శ్రీనివాసాచార్యులు వివరించారు.

# స్టూడెంట్ వీసాపై పాకిస్తాన్‌కు వెళ్లి.. శిక్షణ తీసుకున్న ఆదిల్ థోకర్..!

**వేద న్యూస్, డెస్క్ :**

కశ్మీర్ పహల్గాం ఉగ్రదాడిలో కీలక నిందితుడిగా అనుమానిస్తున్న ఆదిల్ హుస్సేన్ థోకర్ గురించి కీలక విషయం వెలుగులోకి వచ్చింది. అనంత్‌నాగ్ జిల్లాకు చెందిన రషీద్ ఉగ్రవాదానికి అకర్షితుడైనట్లుగా భారత నిఘా వర్గాలు పేర్కొన్నారు. ఆరు సంవత్సరాల కిందట దక్షిణ కశ్మీర్‌లో మృతి చెందిన ఓ ఉగ్రవాది అంతిమయాత్రలో పాల్గొన్నాడని సంబందిత వర్గాలు పేర్కొన్నాయి. అయితే, 2018లో స్టూడెంట్ వీసాపై ఆదిల్ పాక్‌కు వెళ్లాడని.. అక్కడ లష్కరే తోయిబా, ది రిసిస్టెన్స్ ఫ్రంట్ తదితర ఉగ్రవాద గ్రూపుల్లో శిక్షణ తీసుకున్నట్లుగా సమాచారం. దాదాపు ఎనిమిది నెలల పాటు అజ్ఞాతంలోకి వెళ్లిన ఆదిల్.. ఆ తర్వాత ఉగ్రవాద కార్యకలాపాల్లో పాల్గొంటున్నట్లుగా నిఘా వర్గాలు గుర్తించాయి. గతేడాది అక్టోబర్‌లో ఆదిల్ ముగ్గురు పాక్ ఉగ్రవాదులతో కలిసి పూంచ్, రాజౌరి సెక్టార్‌లో నియంత్రణ రేఖ వెంట అక్రమంగా భారత్‌లోకి తిరిగి ప్రవేశించినట్లుగా గుర్తించారు. ఇందు కోసం అటవీ ప్రాంతాలను ఉపయోగించుకొని.. భద్రతా బలగాల కంట పడకుండా తప్పించుకొని కిష్త్వార్, అనంత్‌నాగ్ మీదుగా భారత భూభాగంలోకి చొరబడ్డట్లుగా అనుమానిస్తున్నారు. ఆ తర్వాత అనంత్‌నాగ్‌లో అండర్‌గ్రౌండ్‌లోకి వెళ్లి.. స్థానిక ఉగ్రవాద నెట్‌వర్క్‌తో సంప్రదింపులు జరిపినట్లుగా సమాచారం. అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించేందుకు, ప్రాణనష్టం ఎక్కువగా ఉండేలా.. పర్యాటకులు ఎక్కువగా కనిపించే పహల్గాంను దాడులకు లక్ష్యంగా చేసుకున్నట్లుగా భద్రతా బలగాలు భావిస్తున్నాయి.

ప్రసూతి చికిత్స

# పితామహుడు

**వేద న్యూస్, డెస్క్ :**

డా వి.ఎన్.శిరోద్కర్ ప్రపంచవ్యాప్తంగా 'శిరోద్కర్ కుట్టు' కనుగొన్న వ్యక్తిగా ఖ్యాతిగాంచారు. ఆయన మహిళల వ్యాధుల చికిత్సకు ఎంతో దోహదం చేశారు. విఠల్ నగేశ్ శిరోద్కర్ 1899లో గోవాలోని శిరోదా గ్రామంలో జన్మించారు. గ్రామం పేరు మీదనే వారికి ఆ ఇంటి పేరు సంక్రమించింది. హుబ్లీలో విద్యను అభ్యసించి ముంబయిలోని గ్రాంట్ వైద్య కళాశాలలో చేరారు. 1923లో ఎం.బి.బి.ఎస్. పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. గర్భధారణ, ప్రసూతి శాస్త్రంలో స్పెషలైజేషన్‌తో ముంబయి విశ్వవిద్యాలయం నుంచి 1927లో యం.డి. పట్టా పొందారు. ఉన్నత విద్య కోసం ఇంగ్లాండు వెళ్ళారు. అక్కడ పని చెయ్యటం ఆయనకు ఎంతగానో తోడ్పడింది. ఆధునిక శస్త్ర చికిత్స విధానాలను అక్కడ నేర్చుకున్నారు. ఎందరో ప్రముఖ వైద్యులను, శాస్త్రజ్ఞులను కలుసుకున్నారు. 1931లో ఎఫ్.ఆర్.సి.ఎస్ (ఇంగ్లాండు) పొందారు. ముంబయిలో జె.జె.ఆసుపత్రులకు గర్భధారణ, స్త్రీల వ్యాధులలో గౌరవ ఆచార్యులుగా నియుక్తులయ్యారు. జె.జె.ఆసుపత్రి చాలా విశిష్టమైనది. 4,000 పడకలతో ప్రపంచంలోని పెద్ద ఆసుపత్రులలో అది ఒకటి. 1,500 పట్టా స్థాయి, 650 పిజి స్థాయి విద్యార్థులు ఉంటారు. అది ఆసియాలో ఆధునిక విద్యకు 175 సంవత్సరాల చరిత్ర కలిగిన ఒక ప్రాచీన విద్యా సంస్థ. ఇదే సంస్థలో చారిత్రక ఖ్యాతి గాంచిన రాబర్ట్ కాచ్ పనిచేశారు. క్షయ వ్యాధి మీద చేసిన పరిశోధనలకు అతనికి నోబెల్ పురస్కారం లభించింది. మామూలు గర్భసంచిలో గర్భాశయ ముఖ కండరం మూసుకుని ఉంటుంది. బలహీన గర్భాశయంలో గర్భాశయ ముఖద్వారం తెరుచుకుని ఉంటుంది. 1955లో డా౹౹ శిరోద్కర్ గర్భాశయ ముఖానికి శస్త్ర చికిత్స గురించి వివరించారు. కాల పరీక్షకు నిలబడి ఈనాటికీ దీనిని పాటిస్తున్నారు. గర్భాశయ లోపాలను సరిచేయడానికి ప్రత్యేకమైన పరికరాలను రూపొందించారు. దీనికి చాలా మార్పులు చేశారు కానీ అసలు శస్త్ర చికిత్స ఇప్పటికీ అద్వితీయంగా నిలిచి ఉంది.1951లో పారిస్ లోనూ, 1956లో నేపుల్స్ లోనూ జరిగిన అంతర్జాతీయ సమావేశాలలో తన శస్త్ర చికిత్స గురించి వివరించారు. ఒక హాలీవుడ్ తారకి ఈ పద్ధతితో శస్త్ర చికిత్స సఫలం కావడంతో అతడి ఇటాలియన్ బంధం మరింత బలపడింది. అన్ని రకాల గర్భస్రావాలకు తన శస్త్ర చికిత్స పని చేయదని తెలుసుకోగల సునిశిత బుద్ధి ఆయనది. ఎటువంటి పరిస్థితుల్లో తన శస్త్ర చికిత్స ఉపయోగపడే అవకాశముందో, ఎటువంటి వాటిలో ఉపయోగపడదో స్పష్టంగా విశదీకరించారు. సామాన్యంగా అనిపించే ప్రతిదానిని ప్రశ్నించే తత్వం కలిగిన డా౹౹ శిరోద్కర్‌కు శస్త్ర చికిత్స, దాని వెనక ఉన్న ఆలోచన తట్టి ఉండొచ్చు. ఈ శస్త్ర చికిత్సపై రాసిన పత్రానికి పీఠికలో ఇలా పేర్కొన్నారు "పరిపూర్ణం కాని శస్త్ర చికిత్స పద్ధతుల పట్ల నేను సంతృప్తి చెందేవాడిని కాదు. ఎప్పటి నుంచో వాడుకలో ఉన్న పద్ధతులను మెరుగు పరచడానికి నాకు ఉపాయాలు తడుతూ ఉండేవి."1951 జూన్‌లో ఫ్రెంచి గైనకాలజీ సంఘ రజతోత్సవ ఉత్సవాల్లో, గర్భాశయ ముఖం చుట్టూ మూడు వరుసల కాటన్ పెట్టడానికి శస్త్ర చికిత్స చేసే విధానాన్ని చిత్రాల ద్వారా చూపించారు. ఆ తరువాత కరిగే గుణం ఉన్న కాటన్ ఇందుకు సరైనది కాదని గమనించారు. ఈ పద్ధతిని మార్చి 4-6 నెలల్లో అకారణంగా జరిగే గర్భస్రావాలకు తొడ నుంచి తీసిన నారపట్టి (ఫాసియా లాటా) లినెన్లు ఉపయోగించే శస్త్ర చికిత్సను రూపొందించారు. దీనినే ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా "శిరోద్కర్ శస్త్ర చికిత్స"గా పిలుస్తున్నారు. ఇందుకు రాబోయే తరాలు ఎప్పటికీ ఆయనను గుర్తుంచుకుంటాయి. 1971 మార్చి 7న ప్రొఫెసర్ శిరోద్కర్ ముంబయిలో మరణించారు. ఆయన తల్లి గర్భాశయ ముఖ క్యాన్సర్‌తో మరణించారు. డా౹౹ శిరోద్కర్ కుమారుడు మనోహర్ శిరోద్కర్ ఈ వ్యాధికి ఉన్న వైరల్ కారణాలపై పరిశోధనలు జరిపారు. మొదట్లో ఆయన జాన్ హాప్కిన్స్ ప్రజారోగ్య కళాశాలలో పని చేశారు. క్యాన్సర్ కారకమైన 'రౌస్ సర్కోమా' వైరస్ (మొట్టమొదటగా కనుగొన్న క్యాన్సర్ వైరస్) గురించి పరీక్షలు జరిపారు. తరవాత ఆయన పూనాలోని రాక్ ఫెల్లర్ ఫౌండేషన్ వైరస్ పరిశోధనా కేంద్రంలో పని చేశారు. యువకునిగా ఉన్నప్పుడు మనోహర్ శిరోద్కర్, ప్రఖ్యాతిగాంచిన తన తండ్రి పట్ల ఆరాధన ఉన్నప్పటికీ, వైద్య విద్య పట్ల ఆసక్తి చూపలేదు. 1976లో, మనోహర్, ఆయన భార్య సుధ డా౹౹వి.ఎన్.శిరోద్కర్ జ్ఞాపక పరిశోధన ఫౌండేషన్ ని స్థాపించారు. ఈ సంస్థ మనోహర్ శిరోద్కర్, ఆయన తండ్రి కన్న కలలకు రూపాన్ని ఇచ్చింది. ఈ సంస్థ అట్టడుగు వర్గాలకు చెందిన యువతుల్లో గర్భాశయ ముఖ క్యాన్సర్ పరీక్షలు జరుపుతుంది. వైరల్ వ్యాధులను నయం చేయడానికి కొత్త జైవిక ఏజెంట్లపై పరిశోధనలు చేస్తుంది. విధి నిర్వహణలో తీరిక లేకుండా ఉండటమే కాకుండా, ప్రొ. వి.ఎన్. శిరోద్కర్ విస్తృతంగా రాసేవారు. సాంఘిక వైద్యంలో ఆసక్తి కనపరిచేవారు. గర్భస్రావాలకు సంబంధించిన శాంతీలాల్ షా కమిటీలో ఆయన సభ్యులు. భారత దేశంలో కుటుంబ నియంత్రణ సంస్థను స్థాపించారు. 1971లో భారత ప్రభుత్వం ఆయనను పద్మ విభూషణ్ బిరుదుతో సత్కరించింది.



## ట్రాక్టర్ బోల్తా.. ఐదుగురికి గాయాలు

**వేద న్యూస్, కమలాపూర్ :**

హనుమకొండ జిల్లా కమలా పూర్ మండలం వంగపల్లి గ్రా మానికి చెందిన 19 మంది మహిళలు అదే గ్రామంలో కూలి పని కోసమని వెళ్లారు. కూలి పని ముగించుకొని తిరిగి ఇంటికి ట్రాక్టర్ లో వెళ్తుండగా ట్రాక్టర్ డబ్బా అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో మొత్తం 19 మంది కూలీలు ఉండగా ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన కూలీలను కమలాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వెళ్లగా అక్కడి వైద్యులు వారికి ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్య సహాయం కోసం అంబులెన్సులో ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు.

## శ్రీరామ్ శ్రీ సుస్వరాలు ఆధ్వర్యంలో ప్రత్యేక పాటల విభావరి

**వేద న్యూస్, రంగారెడ్డిప్రతినిధి :**

ఈనెల 27వ తేదీ ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంట నుండి రాత్రి 9:00 వరకు శ్రీరామ్ సుస్వరాలు ఆధ్వర్యంలో త్యాగరాయే గాన సభ లలిత కళా వేదికలో ప్రత్యేక పాటల విభావరి ఉంటుందని శ్రీ సుస్వరాలు అధినేత మూర్తి శ్రీరామ్ తెలిపారు. శనివారం నాడు ఆయన మాట్లాడుతూ గౌరవ సలహాదారులు వ్యవస్థాపక అధ్యక్షులు మనం ఫౌండేషన్ డాక్టర్ చక్రవర్తి డాక్టర్ ఖాసీం భాషా, గౌరవ నిర్వాహకులు డాక్టర్ సోమయాజులు, డాక్టర్ అరుణ జ్యోతి ఆధ్వర్యంలో గౌరవ అతిథులుగా స్వరకిన్నెర శారద వరపుత్ర చింతలపూడి త్రినాధరావు, విశిష్ట అతిథిగా డాక్టర్ జనార్ధన్ రాజు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టార్ సింగర్ స్వర బ్రహ్మ డాక్టర్ మూర్తి శ్రీరామ్, డాక్టర్ కాసిం భాషా, డాక్టర్ సోమయాజులు, గాన రత్న డాక్టర్ అంజయ్య, డాక్టర్ సుబ్బరాజు, డాక్టర్ వి ఎల్ వి ఆర్ జోస్యులు, డాక్టర్ రాజ్యలక్ష్మి, రీటా శ్యామల జగన్మోహన్రావు, అరుణ, జ్యోతి, పద్మావతి, శ్రీదేవి, మల్లాది ఉష, రమ, పద్మ, సులక్షణ, స్వప్న, తదితరులు తమ గళాలకు పదునుపెడతారని సంగీత అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాలు జయప్రదం చేయాలని శ్రీ సుస్వరాలు అధినేత మూర్తి శ్రీరామ్ ఆ ప్రకటనలో తెలిపారు.



## గొట్టిపర్తి శ్రీకాంత్ కు ఘన సన్మానం

**వేద న్యూస్, సుర్యాపేట ప్రతినిధి:**

టిఎంఓఏ రాష్ట్ర కమిటీ కోశాధికారిగా జిల్లా కేంద్రానికి చెందిన శ్రీ సాయి వాసవి మీసేవ కేంద్రం నిర్వాహకులు గొట్టిపర్తి శ్రీకాంత్ ఎన్నికయ్యారు. శనివారం జిల్లా కేంద్రంలో జిల్లా మీసేవ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయనను పూలమాలను శాలు వాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గొట్టిపర్తి శ్రీకాంత్ మాట్లాడుతూ గత 14 సంవత్సరాలుగా వివిధ హొదాలో మీసేవ ఆపరేటర్ల సమస్యల పరిష్కారం కోసం కృషి చేశానని అన్నారు. మీసేవ ఆపరేటర్లకు ఏ చిన్నపాటి సమస్య వచ్చిన ముందుండి పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తానని అన్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మీసేవ ఆపరేటర్లు పిట్టల సతీష్, సట్ల నరేష్, జంపాల అంజి, గోనె సాగర్, కృష్ణ, నాని, హరీష్, నాగయ్య, సురేష్, సత్యనారాయణ, వంశి, జానకి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## పహల్గాం ఘటనలో మృతులకి ఘన నివాళి

**వేద న్యూస్,మెట్ పల్లి :**

మెట్పల్లి పట్టణం లోని శనివా రం టిపిసిసి డెలిగేట్ కల్వ కుంట్ల సుజిత్రావు నివాసములో కాశ్మీర్ పహల్గావ్లో భారతీ య పౌరు లపై ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి ఘన నివాళులు అర్పిం చిన కాంగ్రెస్ నాయకులు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడు తూ జమ్మూ కాశ్మీర్లో ప్రజలపై ఉగ్రవాదుల దాడులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెట్పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్, మెట్ పల్లి కాంగ్రెస్ పార్టీ పట్టణ మాజీ అధ్యక్షులు ఖుతుబ్ పాషా, కాంగ్రెస్ పార్టీ ఫిషర్మేర్ స్టేట్ జనరల్ సెక్రెటరీ రుత్త నారాయణ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సేవాదళ్ జనరల్ సెక్రెటరీ అందె మారుతి బాపూజీ,ఇబ్రహీంపట్నం యూత్ కాంగ్రెస్ మండల ప్రెసిడెంట్ నల్లూరి సాగర్, కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ జాఫర్, బైండ్ల శ్రీకాంత్, మామిడి రాజశేఖర్ రెడ్డి, ఇప్పపల్లి గణేష్ గౌడ్,తోగిటి నాగరాజ్, రాజేందర్, రాజ్ కుమార్, చౌదరి తదిరితలు పాల్గొన్నారు.






# తప్పుల తడకగా ఇందిరమ్మ ఇండ్ల సర్వే..!?

- లబోదిబోమంటున్న అర్హులు
- మొదటి విడతగా నియోజకవర్గానికి 3500 ఇండ్లు
- జాబితాలో ధనికుల పేర్లు రావడం పట్ల విమర్శలు
- జిల్లాల్లో ఊపందుకున్న పైరవీలు
- నాయకులు చుట్టూ తిరుగుతున్న దరఖాస్తు దారులు

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**

నిరుపేదల సొంతింటి కల నెరవేర్చిందికే రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. అయితే ముఖ్యమంత్రి ఆశయాలకు తూట్లు పొడుస్తున్నారు. ఇప్పటికే రేవంత్ సర్కార్ సన్న బియ్యం పథకంతో జనం అభిమానాన్ని పెంచుకుంది. అధికారులు, గ్రామాల అధికార పార్టీ నాయకులు, ఎవరికి వారే పైరవులతో ధనికులకే సొంతమవుతున్న ఇందిరమ్మ ఇండ్లు, నిరుపేదల ఆశలు అడియాశలు అవుతున్నాయని ఆవేదన వ్యక్తం



చేస్తున్నారు. ఇల్లు లేని సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకోవడానికి ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్ధిదారులకు 5 లక్షల రూపాయల సాయం అందించనుంది. ఇటీవల మంత్రి ప్రతి నియోజకవర్గానికి మొదటి విడతగా 3500 ఇండ్ల నిర్మాణం చేపడతామని వెల్లడించారు. దీంతో జిల్లాలోని ఇందిరమ్మ పథకం మాకు ఇల్లు లభిస్తున్నాయని నిరుపేద,మధ్యతరగతి వర్గాల ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. అయితే ఇప్పటికే ఇందిరమ్మ ఇండ్ల మొదటి జాబితా సిద్ధంగా ఉన్నది. సొంతంగా ఇండ్లు నిర్మించుకునే వారికి ఒక్కో ఇంటికి 5 లక్షల రూపాయలు అందించనుంది. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు 100శాతం సబ్సిడీపై 5 లక్షల రూపాయలు మంజూరు చేస్తారు. ఇందుకోసం లబ్ధిదారులు ప్రత్యేక బ్యాంక్ అకౌంట్ ను కూడా తీయవలసి ఉంటుంది. ఇల్లు నిర్మాణం పూర్తయ్యేసరికే 5 లక్షల రూపాయలు లబ్ధిదారుని అకౌంట్లో జమ చేయనుంది. లబ్ధిదారులు కచ్చితంగా ఆహార భద్రత కార్డు, సొంత స్థలం ఉన్నవారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కానుంది. ఇదిలా ఉండగా జిల్లాలో కొన్ని మండలాల్లో ఇందిరమ్మ ఇండ్ల సర్వే తూతూ మంత్రంగానే నిర్వహించారని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇందిరమ్మ ఇండ్ల మొదటి జాబితాలో తమ పేరు వస్తుందో రాదో అని దరఖాస్తుదారులు వేచి చూస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో పైరవీలు జోరందుకున్నాయి. ఇల్లు ఇప్పించాలంటూ అధికార పార్టీకి చెందిన నాయకుల చుట్టూ తిరుగుతూ ప్రదీక్షణలు చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారు అధికార పార్టీకి చెందిన నాయకులతో కలిసి తమకు వచ్చేటట్లు చూడండి అని ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. గ్రామాలలో, పట్టణాలలో కమిటీలు వేసిన తర్వాత ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక ప్రక్రియను జాబితా విడుదల చేయాలని ఇటీవల మంత్రి సైతం ప్రకటించారు. ఇప్పటికైనా ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తులను సంబంధించిన అధికారులు క్షేత్రస్థాయిలో పకడ్బందీగా సర్వే నిర్వహించి అర్హులకు మాత్రమే ఇండ్లు కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.

## అందరికోసం న్యాయ విజ్ఞాన సదస్సులు

**వేద న్యూస్, కోరుట్ల ప్రతినిధి :**



సమాజంలోని అన్నీ వర్గాల ప్రజలకు న్యాయ విజ్ఞానం అందించేందుకే సదస్సులు నిర్వహిస్తున్నాం అని మెట్ పల్లి సీనియర్ సివిల్ జడ్జి డి. నాగేశ్వర్ రావు అన్నారు. శనివారం మండల్ లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకి ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. న్యాయరంగానికి సంబంధించిన జడ్జీలు, న్యాయవాదులు, పోలిసులు కూడా నిత్య విద్యార్తులేనని, ప్రతి ఒక్కరూ సబ్జెక్ట్ నేర్చుకోవడానికి సిద్ధంగా ఉండాలని అన్నారు. ఈ సందర్బంగా సీనియర్ న్యాయవాదులు రాజ్ మహ్మద్, జిల్లా వెంకటేశ్వర్లు, మగ్గిడి వెంకట నరసయ్య, కోటగిరి వెంకటస్వామి, గడ్డం శంకర్ రెడ్డి, దయ్యా రాజారాం లు వివిధ సామాజిక అంశాలు, చట్టాలపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కంతి మోహన్ రెడ్డి, ఉపాధ్యక్షులు తోగిటి రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి పసునూరి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి గజెల్లి రాందాస్, లోక్ అదాలత్ సభ్యులు వద్దేపల్లి శ్రీనివాసన్, జేడి సుధాకర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెర్లపల్లి ఆనంద్ గౌడ్, న్యాయవాదులు బోడ లక్ష్మణ్, బద్దం లక్ష్మారెడ్డి, దయాకర్ వర్మ, శేఖర్, నర్సయ్య, గోపి, వెంకటేష్, రాజేశ్వర్ గౌడ్ మెట్ పల్లి సీఐ అనిల్ కుమార్, ఎస్సై కిరణ్ కుమార్, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.అనంతరం ఇటీవల వెలువడ్డ ఇంటర్మీడియట్ ఫలితల్లో రాష్ట్రస్థాయి రెండవ ర్యాంక్ సాధించిన ప్రముఖ న్యాయవాది మ్యాన నరహరి కూతురు మ్యాన ప్రహర్షిక, తెలంగాణ మైనారిటీ హైస్కూల్లో చదువుతూ మంచి మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థుల్ని సీనియర్ సివిల్ జడ్జి శాలువా కప్పి సన్మానించారు.

## ఉగ్రవాద నిర్మూలనలో కేంద్రానికి సంపూర్ణ మద్దతు

**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి :**



ఉగ్రవాద నిర్మూలనలో కేంద్రానికి సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని పాక్ కు మరోసారి బుద్ధి చెప్పి పిఓకేను భారత్ లో కలపాలని బ్రాహ్మణ సంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు మంగు రాఘవరావు పిలుపునిచ్చారు. జమ్మూ కాశ్మీర్ పహల్గంలో యాత్రికుల మీద పాకిస్తాన్ ముష్కర్ల దాడిని ఖండిస్తూ మహేశ్వరం నియోజకవర్గం బ్రాహ్మణ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంగు రాఘవరావు మాట్లాడుతూ భారత ప్రధాని మోడీ ని ఆదర్శంగా తీసుకొని ఉగ్రమూకలకు గట్టి జవాబు ఇవ్వాలని కోరారు. కోట్లాది భారతీయులంతా ప్రధాని నరేంద్ర మోడీకి మద్దతుగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కొటారు ప్రమోద్, కోశాధికారి చక్రవర్తుల జగన్మోహన్, ఆచార్యులు రంగరాజు యాదగిరిరావు, కృష్ణమోహన్, బోరుపట్ల విరాట్, స్వరూప్, వంశీకృష్ణ శాస్త్రి, నవీన్ కుమార్, రాయప్రోలు వెంకట సుబ్రహ్మణ్యం, జిల్లెల్ల మధుసూదనరావు, జనగామ శంకర్రావు, నందూరి ప్రకాష్, నరేంద్రరావు, వేముల రవికుమార్, పరిషత్ నాయకులు సంజయ్ శర్మ, జగన్నాథ, ఆచార్యులు తిరుమల, ఆచార్యులు సంతోష్ కుమార్, గంప మాధవరావు, మంత్రాల శ్రీరామ్మూర్తి, సతీష్ కుమార్,మంగు కార్తీక్, బ్రాహ్మణ సంఘాల అధ్యక్ష కార్యదర్శుల ఆధ్వర్యంలో బడంగ్ పేట శివ నారాయణపురం చౌరస్తా నుండి హిందూ బంధువులు విశ్వహిందూ పరిషత్ రాష్ట్రీయ స్వయంసేవక సంఘ సభ్యుల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించడం జరిగింది. చనిపోయిన యాత్రికులకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ ముష్కరణ కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.

## ఆవిర్భావ సంబరాలకు ఇది సమయం కాదు..!

**వేద న్యూస్, కోరుట్ల ప్రతినిధి :**



జమ్మూ కాశ్మీర్ లోని పెహల్గామ్లో జరిగిన అమానవీయ సంఘటనను జాతి యావత్తు ముక్తకంఠంతో ఖండిస్తూ, మృతుల ఆత్మ శాంతి కొరకు దేశం నివాళులర్పిస్తుండగా మరో దిక్కు తెలంగాణలో బిఆర్ఎస్ పార్టీ వరంగల్లో 27న జరప తలపెట్టిన పార్టీ ఆవిర్భావ సభను ఆశీర్వదించాలని ఆహ్వాన పత్రికలు పంచుకోవడం విడ్డూరంగా ఉందని పట్టణ మాజీ మున్సిపల్ చైర్మన్ ఎర్రోళ్ల నర్సు హనుమండ్ల యాదవ్ ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆమె శనివారం మెట్పల్లిలోని ఆమె నివాసంలో మాట్లాడుతూ.. దశాబ్ద కాలంగా తెలంగాణను ఏలిన బిఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వనరులతో నిండుగా ఉన్న తెలంగాణను నిలువున దోచి దివాలా తీశారని మండిపడ్డారు. దశాబ్ద ఉత్సవాల పేరిట ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన అప్పటి ప్రభుత్వం.. దోచిన డబ్బుతోనే ప్రస్తుతం హనుమకొండలో పార్టీ ఆవిర్భావ వేడుకల సంబరాలను నిర్వహిస్తుందని అన్నారు. మీకు అంతగా అత్యుత్సాహం ఉంటే మీ పార్టీ రజతోత్సవ ఆవిర్భావ వేడుకలను పాకిస్తాన్ బోర్డర్లో జరుపుకోవచ్చని హితవు పలికారు.

## నిరంతర శ్రామికుడు దిలీప్ సింగ్

మొదటి పేజీ తరువాయి

ఉద్యోగులకు కేవలం వందలలో రిటైర్మెంట్ పెన్షన్ ఉండడం దురదృష్టకరం. దిలీప్ సింగ్ మాత్రం ప్రయాణానికి ఆర్టీసీ భద్రం ఆటోలు వద్దు అంటూ విద్యార్థులను మహిళలను ప్రయాణికులను ప్రోత్సహిస్తూ ప్రతిరోజు మీర్ పేట నుండి బడంగ్ పేట వరకు వివిధ పాయింట్లలో కనిపిస్తూ ప్రయాణికులకు సేవలు అందజేస్తున్నారు. గతంలో ఈయన సేవలను గుర్తించి విశ్రాంత ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పురుషోత్తమ నాయక్ ప్రస్తుత ఎండి సజ్జనార్ కూడా అభినందనలు అందజేశారు. ఇలాంటి వ్యక్తులు మనకు తక్కువగా కనిపిస్తారు ప్రతిరోజు మీర్ పేట సెంటర్లో విద్యార్థులకు మహిళలకు ఇతర ప్రయాణికులకు సేవలు అందిస్తూ కనిపించే దిలీప్ సింగ్ కు హాట్సాఫ్ చెబుతుంది వేద న్యూస్ తెలుగు దినపత్రిక.

## ఛాంబర్‌లలో వసతులను పునరుద్ధరించండి

మొదటి పేజీ తరువాయి

సమకూర్చుడం ఎలక్ట్రికల్ సంబంద సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సిఎంహెచ్ఓ డా.రాజారెడ్డి, ఈ ఈ రవికుమార్, డిఈలు రాజ్ కుమార్, కార్తీక్ రెడ్డి, జేఏఓ లు సరిత, జగదీశ్వరి, సూపరిండెంట్ రావుల ఆనంద్, ఏఈ లు రాగి శ్రీకాంత్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు..!

మొదటి పేజీ తరువాయి

పడ్డారు. ధరణి పేరుతో రైతులను కేసిఆర్ ఆగం చేసిందని విమర్శించారు. కేసిఆర్ ఎక్కడ సభ పెట్టిన ఆ భూములు కబ్జాలకు గురయ్యాయి గతంలో హనుమకొండ ప్రకాశ్ రెడ్డి పేటలో కావచ్చు హైదరాబాద్ లోని కొంగరకలంలో కావచ్చు అదే జరిగిందని ఆరోపించారు. ఇప్పుడు ఎల్కుర్తి సమీప గ్రామాల రైతులకు కూడా అప్రమత్తంగా ఉండాలని చదును చేసిన భూముల్లో హద్దులు జరిపిన బిఆర్ఎస్ నేతలు గద్దల వాలుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్ షా, వన్నాల వెంకటరమణ, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శిలు బాకం హరిశంకర్, డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మాచర్ల దీన్ దయాల్, గడల కుమార్, కోశాధికారి కూచన క్రాంతి కుమార్, అధికార ప్రతినిధులు ఆడెపు వెంకటేష్, శ్రీరంగం సాగర్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు పోలేపాక మార్టిన్ లూథర్, బిజెపి శివనగర్ మండల అధ్యక్షులు మహమ్మద్ రఫీ, బిజెపి నాయకులు రామిని సుమన్, వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

## జర్నలిస్టుల భద్రత చట్టం అమలుకు కేంద్రంపై ఒత్తిడి తేవాలి

మొదటి పేజీ తరువాయి

తెలుపడంతో సభ్యులు అభినందించారు.కేంద్ర ప్రభుత్వం రైల్వే రాయితీ పాసులను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.అదే విధంగా అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఎలాంటి నిభందనలు లేకుండా ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు.జర్నలిస్టుల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రత్యేక పథకానికి రూపకల్పన చేయాలని కోరారు.ఇందుకోసం ఎన్ యూ జె(ఐ) ఆధ్వర్యంలో పోరాటానికి రూపకల్పన చేయాలని సూచించారు.అనంతరం జాతీయ అధ్యక్ష, కార్యదర్శులకు మెమోరాండం అందజేశారు. 29 రాష్ట్రాల ఎన్‌యుజె(ఐ) ప్రతినిధులు, రాష్ట్రాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

## రజతోత్సవ సభను విజయవంతం చేయండి

**వేద న్యూస్, ఎల్కతుర్తి :**



బీఆర్ఎస్ పార్టీ 25 వసంతాలు పూర్తి చేసుకుంటున్న తరుణంలో మాజీ సీఎం కేసీఆర్ వరంగల్ లో నిర్వహిస్తున్న రజతోత్సవ సభకు ప్రజలు అధిక సంఖ్యలో తరలి రావాలని బావుపేట గ్రామ బీఆర్ఎస్ పార్టీ నాయకులు భాషిక నాగరాజు శనివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. గత పదేళ్లలో కేసీఆర్ రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేశారన్నారు. రాష్ట్ర ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలను తీసుకువచ్చి నేరుగా అందించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిందని, హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.

# అందరి ఆకాంక్షలు నెరవేర్చడమే లక్ష్యం

మొదటి పేజీ తరువాయి

రంగంలో ఉద్యోగ అవకాశాలను సృష్టిస్తున్నామన్నారు. తెలంగాణ వేగంగా పెరుగుతున్న ఆర్థిక వ్యవస్థ, అత్యధిక స్వంత పన్ను వసూళ్లు, జీసీసీలు, డేటా సెంటర్లు, ఎలక్ట్రిక్ వాహనాల రంగాల్లో అభివృద్ధితో పాటు దేశంలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలుపాలని యత్నిస్తున్నామని తెలిపారు. అనంతరం రెండు రోజుల పాటు జరిగిన సదస్సులో చర్చించిన వాటిల్లో 44 అంశాలతో కూడిన హైదరాబాద్ తీర్మానం విడుదల చేశారు.

రాజకీయాల్లోకి కొత్తతరం రావాలి : రాహుల్ గాంధీ

గత పదేళ్లలో ప్రపంచ రాజకీయాలు మారిపోయాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. ఆధునిక సామాజిక మాధ్యమాలతో అంతా మారిపోయిందని తెలిపారు. రాజకీయాల్లోకి కొత్తతరం రావాలని రాహుల్ సూచించారు. దేశ సమస్యలు తెలుసుకునేందుకు కన్యాకుమారి నుంచి సుమారు 4 వేల కిలోమీటర్ల పాదయాత్ర చేశానన్నారు. పాదయాత్ర మొదలుపెట్టక ముందు ఆలోచించాను..మొదలుపెట్టాక వెనకడుగు వేయలేదని వివరించారు.పాదయాత్ర మొదలు పెట్టాక చాలా మంది తనతో కలిసి నడవటం మొదలుపెట్టారన్నారు. పాదయాత్రలో జనం సమస్యలు వినటం నేర్చుకున్నానని, ఇప్పుడు వారి సమస్యలు వినటంలో నాయకులు విఫలమయ్యారని రాహుల్ గాంధీ వివరించారు. నిన్ననే భారత్ సమ్మిట్లో పాల్గొనాల్సి ఉన్నా, కశ్మీర్‌కు వెళ్లడం వల్ల రాలేకపోయానని తెలిపారు. పాతతరం నాయకత్వం అంతరించిపోయిందని, రాజకీయాల్లోకి కొత్త తరం రావాలని పిలుపునిచ్చారు. కొత్త తరం భాషను రాజకీయ నాయకులు అర్థం చేసుకోవాలని సూచించారు. కొత్త తరాన్ని ప్రోత్సహించాలి, యువ నేతలను తయారు చేయాలని రాహుల్ గాంధీ తెలిపారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073